క్లుప్తంగా

27న విగ్రహావిష్కరణ


విభూతి బాబూరావు విగ్రహం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలో ఏర్పాటు చేసిన ప్రముఖ జానపద కళాకారుడు, బుర్రకథ సామ్రాట్ విభూతి బాబూరావు విగ్రహాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని విభూతి బ్రదర్స్ జానపద కళాకారుడు విభూతి లోవరాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు, నగర ప్రముఖులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసిన విభూతి బాబూరావు కరోనాతో మృతి చెందారు.

యోగా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రకాశం నగర్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సత్యసాయి ధ్యాన మండలిలో జిల్లాస్థాయి యోగాసనాల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రెడిషనల్, ఆర్టిస్ట్ సోలో సబ్ జూనియర్ బాలురు విభాగంలో కార్తీక్ రామచంద్రారెడ్డి, బాలికల విభాగంలో వెలుగుబంటి సాత్విక, జూనియర్ కేటగిరిలో అనపర్తికి చెందిన ఎస్.అవినాష్ రెడ్డి ప్రథమస్థానాల్లో నిలిచారు. అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి వి.శ్రీధర్ రెడ్డి, కోశాధికారి కరిబండి రామకృష్ణ, సత్యసాయి ధ్యాన మండలి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరభద్రరావు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇంటి నుంచి వెళ్లిన తన 16 ఏళ్ల కుమార్తె తిరిగి రాలేదని తాడితోట రెల్లివీధికి చెందిన ముత్యాల తిరుమల ఆదివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన సమావేశం

కడియం: జనసేన పార్టీ మండలం సమావేశం స్థానిక ఆంజనేయ స్వామివారి ఆలయం వద్ద ఆదివారం జరిగింది. మండల అధ్యక్షుడు ముద్రగడ జెమి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ లక్ష్యాలను వివరించారు. వివిధ గ్రామాలకు చెందిన ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి-సినిమాలు



శ్యామల :	హిడింబ
సూర్యమినీ :	మిషన్ ఇంపాసిబుల్
సూర్యప్యాలెస్ :	బేబీ
స్వామి :	హిడింబ
అశోక :	అన్నపూర్ణ ఫొటోస్టూడియో
శివజ్యోతి :	సామజవరగమన
అనుశ్రీ :	కాజల్‌కార్తీక
రాజా :	బేబీ
ఊర్వశి :	హత్య
రంభ :	ఓపెన్‌హైమర్
మేనక :	హెర్, రంగబలి
అప్సర :	బేబీ
నామవరం	
వీఎస్ మహల్ :	హిడింబ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	బేబీ
కడియం	
వెంకట సూర్య :	హిడింబ

పల్లెటూరికి ఫ్యామిలీ డాక్టర్

- గ్రామాల్లో విస్తృత వైద్యసేవలు
- ఊరిలోనే పరీక్షలు, మందుల పంపిణీ
- పేదలకు ఎంతో ఉపయోగం
- నూతన ఒరవడికి సీఎం జగన్ శ్రీకారం

రూరల్ నియోజకవర్గం

ఫ్యామిలీ డాక్టర్ విధానం	గణాంకాలు
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	60
కొత్తగా పీహెచ్‌సీ	2 కడియపులంక, కాతేరు
104 వాహనాలు	4
వైద్య పరీక్షలు	69,818


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డాక్టర్ లిడియా


ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రోహిత



రాజమహేంద్రవరం రూరల్: వైద్యరంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. పేదలందరికీ సక్రమంగా చికిత్సలు అందేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తున్నారు. దానితో పాటు గ్రామాల్లో ప్రజలకు ఇంటి ముంగిటకు వైద్యం తీసుకువచ్చారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి, విలువైన సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యులు గ్రామాల్లో వైద్యసేవలు నిర్వహిస్తున్నారు. మంచం మీద ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్స చేస్తున్నారు.

నాణ్యమైన వైద్యం

వ్యాధుల బారిన పడితే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందనే బెంగ పోయింది. నాణ్యమైన వైద్యం ఇంటి తలుపు తడుతోంది. ఎలాంటి అత్యవసర పరిస్థితిల్లోనైనా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి కొత్త ఒరవడికి నాంది పలుకుతున్నారు. ఇందులో భాగంగా ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు ఇంటి వద్దే వైద్యం (ఫ్యామిలీ డాక్టర్) అందిస్తున్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తిస్తే సకాలంలో చికిత్స ద్వారా కోలుకునే అవకాశం ఉంటుందని గ్రహించి ఆమేరకు చర్యలు చేపట్టారు.

రూరల్ నియోజకవర్గంలో..

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం సీహెచ్‌సీ, ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారుల ఆధ్వర్యంలో వైద్యసేవలు అందుతున్నాయి. నియోజకవర్గంలో నాలుగు 104 వాహనాల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు అందిస్తున్నారు. 14 రక్త పరీక్షలతో పాటు వివిధ ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాలను డేటాఎఫ్‌పీసీ యాప్‌లో పొందుపరుస్తారు. ఇలా నెలకు రెండుసార్లు ఇంటి వద్దకే వైద్యం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందిస్తున్నారు.

67 రకాల మందులు

కొత్త వైద్య విధానంలో భాగంగా గ్రామంలోనే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 104 వాహనంలోని మెడికల్ ల్యాబ్‌లో 14 రకాల పరీక్షలు చేస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వైద్యులు సూచనల మేరకు రక్త పరీక్షలు చేస్తున్నారు. బాధితులకు అప్పటికప్పుడే మందులు పంపిణీ చేస్తున్నారు. వాహనంలో 67 రకాల మందులు సిద్ధం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ, శస్త్రచికిత్స అనంతరం బాధితుడి పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

సేవలు అభినందనీయం



ఫ్యామిలీ డాక్టర్ విధానం పేద, మధ్య తరగతి కుటుంబాలకు చాలా ఉపయోగకరం. నెలకు రెండుసార్లు 104 వాహనం వస్తోంది. వైద్యులు పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్‌కు ఉచితంగా మందులు ఇస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అన్ని మందులూ అందజేస్తున్నారు.

– కాటిపల్లి నరసమ్మ, డి బ్లాకు, హుకుంపేట

పేదల చెంతకే వైద్యం



కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగి అప్పుల పాలు కాకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం పేదలకు ఒక వరం. ప్రతి నెలా రెండుసార్లు వచ్చి అవసరమైన పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నారు. నాతో పాటు ఎంతో మందికి ఈ విధానం ద్వారా మేలు జరుగుతోంది.

– నీలం చంద్రశేఖర్, అభ్యుదయ కాలనీ, రాజవోలు

మెరుగైన వైద్యసేవలు



పదేళ్ల క్రితం కాళ్లు, చేతులు పడిపోయాయి. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోనూ, ఆ తర్వాత కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాను. అనంతరం స్పెషలిస్టుకు చూపించడంతో రికవరీ అయ్యాను. షుగరు వ్యాధి నివారణకు ప్రైవేటు ఆసుపత్రిలో మందులు వాడేవాడిని. ప్రస్తుతం 104 వైద్యసేవలతో పాటు ఫ్యామిలీ డాక్టర్ రావడంతో వైద్యునికి చూపించుకుని మందులు వాడుతున్నాను.

– జమ్మి ఏడుకొండలు, ఆటోడ్రైవర్, రాజవోలు

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు


ఎంపీ భరత్‌రామ్, నాగేశ్వరరావుతో సాగర్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని, డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) ప్రత్యేక ఆహ్వానితుడిగా కానుబోయిన సాగర్‌ను నియమించడమే దానికి నిదర్శనమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఈ మేరకు సాగర్ ఆదివారం ఎంపీ భరత్ రామ్, బీసీ సమాఖ్య చైర్మన్ మార్గాని నాగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్‌ను మాట్లాడుతూ సాగర్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ, మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ ఆరోగ్య మిషన్ జనాభా పరిశోధన మానిటరింగ్ బృందం (కేంద్ర బృందం) జిల్లాలో చేపట్టిన మూడురోజుల పర్యటన ముగిసిందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆ బృందంలోని అధికారులైన డాక్టర్లు రాజేష్, జే.నాయర్, ఎంసీ మాథ్యూస్ గోకవరం, కోరుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రాలను, అనపర్తి ఏరియా ఆసుపత్రిని సందర్శించారన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య సేవలను పరిశీలించారన్నారు. వాటిపై సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిపారు.

మానవ సంస్కృతీ సారమే నాట్యం


చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు


నాట్యం చేస్తున్న తంగిరాల విజయ లాస్య

- విద్యాశాఖ ఆర్‌జేడీ కృష్ణ
- ఘనంగా నటరాజ రామకృష్ణ శత జయంతి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): మానవ సంస్కృతీ సారమే నాట్యమని నిరూపించిన మహోన్నతుడు నటరాజ రామకృష్ణ అని ఉన్నత విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆచార్య చప్పిడి కృష్ణ అన్నారు. కళాప్రియ నత్య కళాక్షేత్రం, రాజమహేంద్రవరం నాట్య గురువుల సంయుక్త నిర్వహణలో స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రెండోరోజు ఆదివారం జరిగిన నటరాజ రామకృష్ణ శత జయంత్యుత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితకాలాన్ని నాట్యం కోసం వెచ్చించిన గొప్ప తపోధనుడు నటరాజ అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఆనాటి మహా పురుషులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్య తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ సాహిత్యకారుడిగా నటరాజ రామకృష్ణ గురించి తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, వారు రాసిన 50 పుస్తకాలే అందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పీవీ సంజీవరావు, నాట్యాచార్య ఆచంట చంద్రశేఖర్, డాక్టర్ ఎ.ఆంజనేయులు, రెడ్డి ఉమారాణి, మేడిద నాగేశ్వరరావు, సప్పా యశోదకృష్ణ, పల్ల దుర్గాప్రసాద్, గాయత్రీ పట్నాయక్, జీబీ నారాయణ, అడ్డాల నాగేశ్వరరావు, కె.సాయి వాసవి, చీర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 350 మందికి పైగా నాట్య కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు.

అలరించిన నాట్యాభినయం

రాజమహేంద్రవరంలో రెండు రోజులుగా నృత్య నీరాజనాలతో సందడి నెలకొంది. ఆదివారం ఒక పక్క వర్షం, మరో పక్క నృత్యం పోటీ పడ్డాయి. 30 మందికి పైగా విశిష్ట నాట్యగురువులతో ఒకే వేదికపై చేసిన నృత్యాభినయం అలరించింది.

నర్సరీ రంగ అభివృద్ధికి కృషి

కడియం: నర్సరీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు సభ్యుల సహకారంతో కృషి చేస్తానని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మల్లు పోలరాజు అన్నారు. బుర్రిలంకలోని పీఎస్ఎం కన్వెన్షన్ హాలులో ఆదివారం అట్టహాసంగా కొత్త పాలక వర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నర్సరీ రంగ ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పోలరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంగా ఈ బాధ్యతను అప్పగించిన అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖుల చేతుల మీదుగా గత పాలకవర్గం సభ్యులను ఘనంగా సత్కరించారు. అలాగే ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన పలువురు నర్సరీ రంగ ప్రముఖులను పూలమాలలతో సత్కరించారు.

ఉధృతంగా గోదావరి ప్రవాహం


ములకల్లంక - బొబ్బిల్లంక మధ్య గోదావరి ప్రవాహం

సీతానగరం: అఖండ గోదావరి వరద కొంతమేర తగ్గినా, ప్రవాహం మాత్రం ఇంకా ఉధృతంగానే ఉంది. ములకల్లంకకు నాలుగు రోజులుగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేవు. వరద నేపథ్యంలో వివిధ శాఖల అధికారులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అప్రమత్తం చేశారు. తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. జాలిమూడి వద్ద కోతకు గురైన ఏటిగట్టు వద్ద ఏడాది క్రితం ఇసుక బస్తాలు వేసి రక్షణ చర్యలు చేపట్టిన ప్రాంతంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఇసుకను సిద్ధంగా ఉంచారు. అత్యవసర పరిస్థితిలో ఇసుక బస్తాలతో ఏటిగట్టును పటిష్టం చేస్తామని ఏజీఎల్‌బీ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. గోదావరి వరద ములకల్లంక గ్రామంలోకి ఇంకా రానందున ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన పని లేదని పంచాయతీ కార్యదర్శి రజాక్ 'సాక్షి'కి తెలిపారు. గ్రామంలో పారిశుధ్య చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఆర్వోప్లాంట్ ద్వారా తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారులతో చర్చించి, రెండు బోటులను ఏర్పాటు చేయించడంతో ప్రజలు వాటిపై ప్రయాణం చేస్తున్నారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఎంపీడీవో కె.రమేష్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

నీట మునిగిన మేకప్పచెరువు రోడ్డు


మేకప్ప చెరువు రోడ్డుపై నీరు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మేకప్పచెరువు రోడ్డు నీట మునగడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు పిడింగొయ్యి పంచాయతీ, హుకుంపేట గణేష్ నగర్ ప్రాంతంలోని మురుగునీరంతా ఈ చెరువులోకి చేరుతోంది. దీంతో చెరువు నిండిపోయి, ఆ నీటితో ప్రధాన రోడ్డు మునిగిపోయింది. ఆదివారం ఇటుగా రాకపోకలు సాగించిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ అభినయ నృత్యకళాకారుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. స్థానిక తాడితోట సెంటర్‌లోని సంహిత కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఉభయ గోదావరి జిల్లాల సినీ అభినయ నృత్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కళాకారుల ద్వితీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ టీవీలు, సినీ థియేటర్లు ఎక్కువగా లేని ఆ రోజుల్లో సినీ అభినయ కళాకారులే ప్రజలను అలరించేవారన్నారు. వారి సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ సినీ అభినయ నృత్య కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

కోవిడ్ సమయం నుంచి ఇబ్బందులు

కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.భరణి కుమార్, ఉభయ గోదావరి జిల్లాల సంఘం అధ్యక్షుడు ములపర్తి ఆదినారాయణ (అనిల్ కుమార్) మాట్లాడుతూ సినీ అభినయ నృత్య కళాకారులు ప్రస్తుతం చాలాగడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. కోవిడ్ సమయం నుంచీ అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాము ఎక్కడికైనా వెళ్లి కార్యక్రమాలు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని కోరారు. కళాకారులందరికీ ఇళ్లు, వృద్ధ కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ముందుగా సినీ అభినయ నృత్య కళాకారులు వైఎస్సార్, చిరంజీవి, ఎన్టీఆర్, నాగార్జున, మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, వెంకటేష్ వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, కోశాధికారి తులసీరామ్, సెక్రటరీ పి.రవికుమార్, ఉభయ గోదావరి జిల్లాల సంఘ ఉపాధ్యక్షుడు కటికిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి మజ్జి శ్రీనివాసరావు, కోశాధికారి సీహెచ్ అప్పారావు, జాయింట్ సెక్రటరీ షేక్ బాషా, పొన్నా ప్రసాద్, పసలపూడి దివాకర్, బాబీ, లక్కీ, శంకరం, మైనర్ బాబు, ఎస్.విమల, గుంటూరు చంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

స్వచ్ఛమేవ జయతే..


పార్కులో పిట్ కంపోస్టింగ్ యూనిట్

- స్వచ్ఛ నగరానికి అడుగులు
- సర్వేక్షణ్ 2023లో ఉత్తమ ర్యాంకు సాధనే ధ్యేయం
- ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. దేశవ్యాప్తంగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా నిర్వహించే సర్వేలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు అత్యుత్తమ స్థానం సాధించేందుకు కమిషనర్ దినేష్ కుమార్ అనేక ప్రణాళికలు రూపొందించారు. దీంతో నగరం ఆ దిశగా అడుగులు వేస్తోంది. 2021లో 41వ స్థానం సాధించిన రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ 2022లో 94కి పడిపోయింది. దీంతో ఈసారి టాప్ 20లో ఉండేలా కమిషనర్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.

ప్రత్యేక దృష్టి

ప్రధానంగా కమర్షియల్ ఏరియాలపై దృష్టి సారించి ప్రతి షాపు వద్ద ప్రత్యేకంగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయిస్తున్నారు. ఆ షాపు నుంచి వచ్చే ఏ వ్యర్థాలనైనా అందులో వేసేలా ఆదేశాలిచ్చారు. నగర వ్యాప్తంగా సుమారు 65 ట్విన్ డస్ట్‌బిన్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రధాన జంక్షన్లు, గోదావరి ఘాట్‌లలో తడి, పొడిచెత్త వేసేందుకు నగరంలో ట్విన్ డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కమర్షియల్ ఏరియాలు, పెద్ద హోటళ్లు, పలు అపార్ట్‌మెంట్ల వద్ద వ్యర్థాలను ఎరువుగా మార్చేందుకు ఏర్పాట్లు చేశారు. పార్కుల్లో వ్యర్థాలను ఎరువుగా మార్చేందుకు 30 పార్కుల్లో పిట్ కంపోస్టింగ్ ఏర్పాటు చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తున్న సంస్థలు, పాఠశాలలు తదితర వాటిని గుర్తించి, ప్రోత్సహించి సత్కరించే చర్యలు చేపట్టారు. రాజమహేంద్రవరం నగరంలోని 50 డివిజన్లలో సుమారు 4 లక్షల మందికి పైబడి జనాభా నివసిస్తున్నారు. 65 వేల గృహాలలో దాదాపు లక్ష కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాగా.. 5 కేటగిరీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను అనుసరించిన వారిని గుర్తించి సత్కరించారు.


హోటల్ షెల్టన్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువుల తయారీ యూనిట్

టాప్ 20 ర్యాంకు సాధనకు కృషి



స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో రాజమహేంద్రవరం దేశంలో టాప్ 20 ర్యాంకు సాధించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేశాం. దీనికోసం అన్నివర్గాల వారికి అవగాహన కల్పించాం. నగరంలో పారిశుధ్య మెరుగుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

– దినేష్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్

అవార్డుల గ్రహీతలు వీరే..

- స్వచ్ఛ స్కూళ్లు,: ది ఫ్యూచర్ కిడ్స్, డిస్నీ లిటిల్ చాంప్స్, సిటీ స్పెషల్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమికోన్నత పాఠశాల
- స్వచ్ఛ అపార్ట్‌మెంట్లు: సాయి విక్రమాదిత్య, కింగ్స్ పారడైజ్, సామ్రాట్ రాజరాజ నరేంద్ర, ఆక్సిజన్ టవర్స్
- స్వచ్ఛ హాస్పిటళ్లు: సుభద్ర, డెల్టా
- స్వచ్ఛ హోటళ్లు: లా హాస్పిన్, షెల్టన్, సితార
- స్వచ్ఛ మార్కెట్లు : తుమ్మలావ రైతుబజార్, క్వారీ జంక్షన్ రైతుబజార్
- స్వచ్ఛ ఎన్‌జీవోలు: ఓఎన్‌జీసీ, బింగ్ బ్లాక్ గ్లోరీ, జేసీఐ ఫెరల్స్
- స్వచ్ఛ షార్ట్ ఫిలిం: విజన్ మార్కెటింగ్